క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా బాధ్యతల స్వీకరణ


రామకృష్ణ

కడప అర్బన్ : కడప ఒన్‌టౌన్ సీఐగా బి.రామకృష్ణ గురువారం బాధ్యతలను చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా విధులను నిర్వహించారు. సీఐగా పదోన్నతి పొందిన తరువాత కడప చిన్నచౌక్, అనంతపురం, కర్నూలు జిల్లాలలో పని చేశారు. ప్రస్తుతం కర్నూలు నుంచి కడప ఒన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థినులు

వైవీయూ : కడప నగరంలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 4వ జాతీయ ఫార్మా విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ఆసుపత్రుల సహకారంతో హెల్త్‌క్యాంపు నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు హెల్త్‌క్యాంపులో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించిన వారిపై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని వక్కలపేటలో ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టిన రామసుబ్బయ్య, ఇంకా ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బి.నాగార్జున తెలియజేశారు. ఈ ఇంటి నిర్మాణం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి వెళ్లి అభ్యంతరం తెలుపగా వారు అడ్డుకున్నారు. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కమలాపురం : ప్రజల సమస్యల పట్ల మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ చూపి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కడప ఆర్‌డీఓ, కమలాపురం నగర పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వెంకటపతి తెలిపారు. గురువారం ఆయన కమలాపురం నగర పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. అలాగే టౌన్ ప్లానింగ్, పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏ సమస్య ఉన్నా తక్షణం పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం 1వ వార్డు సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది హాజరును పరిశీలించారు. వార్డు పరిధిలో వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారం తదితర వాటిపై సిబ్బందితో ఆరా తీశారు. ఇకపై ప్రతి గురువారం కమలాపురం నగర పంచాయతీని విజిట్ చేస్తానని, ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, రెవెన్యూ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవల కోసం 15100కు డయల్ చేయండి

కమలాపురం : కోర్టు కేసుల్లో ఉన్న కక్షిదారులు న్యాయ సేవలకై 15100కు డయల్ చేసి న్యాయ సేవలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆదేశాల మేరకు గురువారం స్థానిక సబ్‌జైలును ఆయన సందర్శించి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఏవైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అని జైళ్లలో రెండవ పాన్ ఇండియా ప్రచారం-2024 నిర్వహిస్తున్నామన్నారు. జైళ్లల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి అవసరమైన న్యాయ సేవలు అందించడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశం అన్నారు. పాన్ ఇండియా ప్రచారానికి సంబంధించిన సమాచారం బ్యానర్ల రూపంలో బస్టాండ్, రైల్వేస్టేషన్లు, డీఎస్పీ ఆఫీసులు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు, బార్ అసోసియేషన్ హాలు, కోర్టు, జైళ్లలో ఏర్పాటు చేశామన్నారు. ప్యానల్ నాయవాదులు, పారా లీగల్ వాలంటరీలచే కరపత్రాలు పంచుతున్నామన్నారు. న్యాయ సేవలు కావలసిన వారు 15100కే డయల్ చేసి పొందవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

బాల నేరస్తులను గుర్తించి న్యాయం చేయాలి

జమ్మలమడుగు రూరల్ : జైలులో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి న్యాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం పట్టణంలోని సబ్‌జైలును రెండవ పాను ఇండియా ప్రచారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రకారం జైల్లో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయం అందిస్తామన్నారు.

పరిశుభ్రత.. ఆరోగ్య భద్రత


వైవీయూలో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న వీసీ, అధ్యాపకులు, విద్యార్థులు


ఊటుకూరులోని కేవీకే ర్యాలీలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

- వైవీయూ వీసీ కృష్ణారెడ్డి

వైవీయూ : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య భద్రత లభిస్తుందని వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైవీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతపై అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంగా మారిందని, దాన్ని మనం నివారించకపోతే అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవలిసి వస్తుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమాలను అక్టోబర్ 2వ తేది వరకు కొనసాగిస్తామని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ మాట్లాడుతూ సేవ కార్యక్రమాల్లో యువత ముందుండాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎస్పీ వెంకట రమణ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పీఓలు ఆచార్య ఎం.అనిత, డాక్టర్ మృత్యుంజయరావు ఆధ్వర్యంలో ఆర్ట్స్‌బ్లాక్‌లో వ్యర్థాలను తొలగించారు. అనంతరం వలంటీర్లు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. వైవీయూలోని అన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్లు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఓలు శ్రీధర్‌రెడ్డి, లలిత, సుమిత్ర, కె.శ్రీనివాసరావు, సునీత, అధ్యాపకులు, స్కాలర్‌లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో..

కడప నగర పరిధి ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేష్, మానస, సాయి మహేశ్వరి, వి.శిల్పకళ, ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

నాగార్జున కళాశాలలో..

కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కళాశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అనంతలక్ష్మి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో..



నగరపాలక అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ హైస్కూల్ మెయిన్ విద్యార్థులు, కడప నగరపాలక సంస్థ ఉద్యోగులతో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞ చేయిచారు. కడప కార్పొరేషన్ కమిషనర్ వై. ఓ.నందన్ ఆధ్వర్యంలో ఈ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇతరులను కూడా స్వచ్ఛత పాటించడానికి ప్రోత్సహించాలన్నారు. మన గ్రామాలు, పట్టణాలు, నగరాలు పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. తద్వారా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు నారాయణస్వామి, ధనలక్ష్మి, సిటీ ప్లానర్ సూరజ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీఎంఎం హరి ప్రసాద్ పాల్గొన్నారు.

21 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కడప మండల స్థాయి క్రీడా ఎంపికలు ఈనెల 21 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కడప మండల కోఆర్డినేటర్ ఎస్. సాజిత్ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9440751162 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తేదీ	క్రీడాంశం	వేదిక
21-09-24	చదరంగం	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
21-09-24	యోగా	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
23-09-24	షటిల్ బ్యాడ్మింటన్	వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం, కడప
23-09-24	వాలీబాల్	డీఎస్ఏ మైదానం, కడప
24-09-24	కబడ్డీ	మున్సిపల్ హైస్కూల్ ఉర్దూ (బాలురు), కడప
25-09-24	ఖోఖో	మున్సిపల్ హైస్కూల్ ఉర్దూ (బాలురు), కడప

'తాపీ' పునాదులపైనే ఆధునిక పత్రికా రచన


తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహిత్యాభిమానులు

కడప కల్చరల్ : ప్రముఖ రచయిత తాపీ ధర్మారావు వేసిన సాహిత్య పునాదులపైన నేటి ఆధునిక పత్రికా రచన వర్ధిల్లుతోందని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో తాపీ ధర్మారావు 138వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. నేటి పత్రికా రచన అత్యంత సరళంగా ఉండటానికి తాపీ ధర్మారావు కృషి కారణమన్నారు. అవధాని మాడుగుల శివశ్రీ శర్మ మాట్లాడుతూ విజయ విలాస కావ్యానికి హృదయోల్లాసం పేరు పెట్టిన తాపీ ధర్మారావు దానికి మనోజ్ఞమైన వ్యాఖ్యానం చేశారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరచారి మాట్లాడుతూ తాపీ ధర్మారావు రచించిన దేవాలయాలపైన బూతు బొమ్మలెందుకు?, పాత పాడి-కొత్తపాడి, సాహిత్య మొరమరాలు, పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు తదితర పుస్తకాలు ఎనలేని పేరు గడించాయన్నారు. కల్లూరు బాల యల్లారెడ్డి, జీవకళ సత్యనారాయణ, నాగరాజు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో కళాకారులు మందల మురళి, దేవరశెట్టి గంగయ్య, దాసరి ప్రకాశం, బాల ఓబయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్ : పరిసరాల పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక రామరాజుపల్లె-1 సచివాలయ పరిధిలోని చెంచు కాలనీలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత కూడా ఎంతో ముఖ్యమన్నారు. వైద్యులు సూచించిన విధంగా గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించాలన్నారు. దోమల నియంత్రణకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. వారంలో ఒకరోజు ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిగిత, సబ్ యూనిట్ ఆఫీసర్స్ నాగలక్ష్మిరెడ్డి, ప్రసాద్, సూపర్ వైజర్లు మహబూబ్‌బాషా, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా సైబర్ నేరగాళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్ : వాట్సాప్ వీడియో కాల్ ద్వారా తాము ముంబయి పోలీసులమంటూ బెదిరించి ధర్మవరంలోని ఓ వైద్యుడి నుంచి రూ.33 లక్షలను కాజేసిన సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 18న ధర్మవరానికి చెందిన డాక్టర్ తరుగు సూర్యనారాయణరెడ్డికి 9177597242 నంబర్‌తో వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. అగంతకుడు తాను ముంబయి పోలీసు విభాగం నుంచి మాట్లాడుతున్నట్లుగా తెలిపాడు. నరేష్ గోయల్ అనే వ్యక్తి కెనరా బ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకుని, ఆ డబ్బు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని, ఇందులో మీ అకౌంట్ కూడా ఉందంటూ డాక్టర్‌ను బెదిరించాడు. రూ.20 లక్షలు తీసుకున్నట్లుగా కేసు నమోదైనట్లుగా తెలిపాడు. డాక్టర్ నమ్మక పోవడంతో డాక్టర్‌కు సంబంధించి తన వద్ద ఉన్న నకిలీ ఆధార్ కార్డు, నకిలీ బ్యాంక్ స్టేట్‌మెంట్, ఫేక్ డెబిట్‌కార్డు చూపించి నమ్మించాడు. ధర్మవరానికి వచ్చి డాక్టర్‌తో పాటు కుటుంబసభ్యులనూ అరెస్ట్ చేసి ముంబయికి తీసుకెళతామని బెదిరించాడు. ఈ కేసు నుంచి బయటపడాలంటే రూ.33 లక్షలు చెల్లించాలని సూచించాడు. అప్పటికే బెదిరింపులతో బెంబేలెత్తిన డాక్టర్ అనాలోచితంగా ఆగస్టు 20న స్థానిక బ్యాంక్ ఖాతా నుంచి రూ.20 లక్షలను ఆర్‌టీజీఎస్ ద్వారా వారు చెప్పిన బ్యాంకు ఖాతా 885621000018823 (మంగమద్దల ఎంటర్‌ప్రైజెస్)కు బదిలీ చేశాడు. అనంతరం ఐడీబీఐ నుంచీ అదే అకౌంట్‌కు మరో రూ.13 లక్షలు జమ చేశాడు. రెండు రోజుల తర్వాత తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు నిర్ధారించుకుని ఆగస్టు 22న ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైం సీఐ తిమ్మారెడ్డి పక్కా ఆధారాలతో సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, పుట్లంపల్లి మండలం శివానందపురం గ్రామానికి చెందిన నగలరాపు స్వామిదాసు, నంద్యాల జిల్లా అయ్యలూరుమెట్టకు చెందిన మంగమద్దెల ప్రహ్లాద్, ఆళ్లగడ్డ మండలం యాదవాడ గ్రామానికి చెందిన బెలగడ కిషోర్, నంద్యాలలోని వెంకటచాలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గూడపల్లి గ్రామానికి చెందిన జావీద్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ రత్న అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ చదువుతో ఉన్నత అవకాశాలు


మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ : ప్రపంచ స్థాయిలో మెరవాలంటే ప్రణాళిక బద్ధంగా చదవాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సూచించారు. 'యూఎస్ఏ, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాలలో ఉన్నత చదువులు, ప్లేస్‌మెంట్ అవకాశాల'పై అవగాహన కార్యక్రమం గురువారం మధ్యాహ్నం వైవీయూ సేనేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజం మీకోసం ఎదురు చూస్తోందని, విద్యార్థి దశలో సంపూర్ణ జ్ఞానాన్ని సమపార్జించుకోవాలన్నారు. ఆంగ్లంలో సంభాషించే వారిని, చదువుతున్న కోర్సులో మార్కుల పరంగా ప్రతిభ చూపిన వారికి విదేశాల్లో విద్య ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈఓ, వ్యవస్థాపకులు కె.రామారావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పైచదువులకు, పీజీ విద్యార్థులు పరిశోధనలకు, ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే వారికి ఆర్డీఎల్ టెక్నాలజీ సంస్థ ఉచితంగా సహాయపడుతుందన్నారు. విదేశాలలో టాప్-100 విశ్వవిద్యాలయాల్లో సీటు పొందే విధానం, అందుకు గల అర్హతలు, పాస్‌పోర్ట్ పొందే విధానంపై అవగాహన కల్పించారు. అక్కడ కోర్స్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు పొందేలా సహకారం అందిస్తామన్నారు. ఆయా దేశాలలో చదువుతో పాటు పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటూ కోర్సు పూర్తి చేసుకొనే అద్భుత అవకాశం ఉందన్నారు. అయితే ఐదేళ్ల మంచి స్థానంలో ఉండాలనుకునే పట్టుదలగల విద్యార్థులలో వందమందికి తమ సంస్థ అవకాశం కల్పిస్తుందన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు గురించి ఆందోళన అక్కర్లేదని వివరించారు. అమెరికాలో దశాబ్దన్నర కాలంగా పని చేస్తున్న భాస్కర్‌రెడ్డి ఐటీ జాబ్స్‌పై వివరించారు. ఆర్డీఎల్ టెక్నాలజీ సంస్థ భారతదేశ ప్రతినిధి నిరంజన్ వివిధ దేశాలలో చదువులు- ఉద్యోగ అవకాశాలపై విశ్లేషించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కడప యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ హితేంద్రనాథ్ యూనియన్ బ్యాంకు విద్యార్థులకు అందించే ఆర్థిక చేయూతపై వివరించారు. ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎల్.వి.రెడ్డి అధ్యక్షత వహించగా, సైకాలజీ సహ ఆచార్యులు వి.లాజర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్రజాపక్షం వహించాలి

- జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ప్రజాపక్షం వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషలతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లు కృషి చేయాలని కోరారు. అందరూ పార్టీ బలోపేతానికి సహకరించాలన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తలు, నాయకులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు మాసీమబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో భవితకు బాటలు వేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి

వైవీయూ : విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కడప మహిళా పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ జి.రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం పోక్సో యాక్ట్, పిల్లల భద్రత, బాల్యవివాహాలు, ఈవ్‌టీజింగ్, డయల్ 100, రహదారి భద్రత, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు శాంతమ్మ, నస్రీన్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానంలో పెంపకంతో లాభాలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి

వైవీయూ : గొర్రెలు, మేకలను శాస్త్రీయ విధానంలో పెంచడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చని ఊటుకూరు కృషివిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.వీరయ్య సూచించారు. గురువారం కడప నగర పరిధి ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకంపై యువరైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపకంలో తీసుకోవాల్సిన మెలకువలపై వివరించారు. పశువిభాగం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ప్రదర్శనలో మేకలు, గొర్రెల జాతులు, ప్రత్యేకతలు, లాభాలపై వివరించారు.

ముస్లిం మత పెద్దలతో ఎంపీ భేటీ


ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరం బాలాజీ నగర్‌లోని అబ్బాస్ మసీదు(మర్కస్)లో ముస్లిం మతపెద్దలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ చర్చల్లో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అమెండ్‌మెంట్ బిల్లుపై మత పెద్దల అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల రక్షణ, భద్రత తమ పార్టీ విధానమని, ఈ బిల్లును వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్, అధికారులు

కడప కార్పొరేషన్ : వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. గురువారం స్థానిక కడప మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 50 మంది ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. పరస్పర బదిలీలు, ఖాళీలను భర్తీ చేశారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు ఈ కౌన్సిలింగ్‌లో పాల్గొన్నారు. నగరపాలక సిబ్బంది, సపోర్టింగ్ స్టాఫ్ సహాయంతో వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించి బదిలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈలు నారాయణస్వామి, ధనలక్ష్మి, ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూ సెమిస్టర్ ఫలితాల విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, పరీక్షల నియంత్రణ అధికారులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన ఆర్కిటెక్చర్ 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ విడుదల చేశారు. గురువారం విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్ కుమార్‌రెడ్డి, పరీక్షల విభాగం అధికారులతో కలిసి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 2వ సెమిస్టర్‌లో 90 శాతం ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిఆపరు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అదనపు అధికారులు ఫణీంద్రరెడ్డి, ఉదయప్రకాష్ రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.

పాఠశాల సముదాయాల పునర్ వ్యవస్థీకరణ పూర్తి చేయాలి


మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ శామ్యూల్

వైవీయూ: స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు శామ్యూల్ ఆదేశించారు. గురువారం కడప కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు యూడైస్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్ పునర్ వ్యవస్థీకరణ సమయంలో ప్రభుత్వ, అన్ని యాజమాన్య పాఠశాలలు ఒక క్లస్టర్ పరిధిలోకి వచ్చే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

సుడి దోమను నివారించాలి

కమలాపురం : వరి పంటలో ఉన్న సుడిదోమను నివారిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని మీరాపురంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి పంటను పరిశీలించి సుడిదోమ, ఆకునల్లి ఉందని గుర్తించారు. కార్యక్రమంలో మండల ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.